నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 15 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

## పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- డిమాండ్లను నెరవేర్చాలని మోకాళ్లపై కూర్చొని నిరసన
- నిర్మల్‌లో ఉధృతంగా కొనసాగుతున్న నిరవధిక సమ్మె



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 14 : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్స్‌ను నెరవేర్చి, తమను రెగ్యులర్ చేయాలని నిరసిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టిన నిరవధిక సమ్మె నిర్మల్‌లో ఉధృతంగా కొనసాగుతున్నది. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట గల జాతీయ రహదారిపై మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాదర్, రాజారత్నం, ఆనంద్, హరీశ్, స్పందన్, విజయ్, నవిత, వీణ, అపర్ణ, గంగామణి, ప్రభ, జ్యోతి, శ్రీతల దేవి, సాయినాథ్, వివేక్ రాజు నాయక్, నారాయణ పాల్గొన్నారు.

### సీఎం సారూ.. మా మమ్మీ వాళ్ల సమస్యలు పరిష్కరించరూ..

సీఎం రేవంత్ రెడ్డి సారూ.. మా మమ్మీ వాళ్ల సమస్యలను పరిష్కరించాలని ఓ చిన్నారి సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహం వద్ద విలపించింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఐదు రోజులుగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్నారు. తన తల్లిలో కలిసి చిన్నారి నిరవధిక సమ్మెలో పాల్గొన్నది. సమ్మెకు పిల్లలతో తరలి వచ్చి మహిళా ఉద్యోగులు నిరసనలో పాల్గొంటున్నారు.

# ప్రొటోకాల్ రగడ

- మంత్రి సీతక్క పర్యటన ఉద్రిక్తం
- ఫ్లెక్సీలో కనిపించని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో
- ఆశ్రమ పాఠశాల ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- గిరిజన ఎమ్మెల్యేకు ఇదేనా గౌరవం అంటూ నినాదాలు
- ప్రభుత్వం తీరుపై మండిపాటు

ఆదిలాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మంత్రులు గురుకులాల సందర్శనలో భాగంగా శనివారం మంత్రి సీతక్క జిల్లాలో పర్యటించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. దీంతోపాటు మంత్రి పర్యటన సందర్భంగా అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని, నేరడిగొండ గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో పెట్టలేదంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఉట్నూర్, బోథ్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరిట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను విస్మరిస్తుందని మండిపడ్డారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ఎమ్మెల్యేగా ఉన్న తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజాప్రతినిధులను విస్మరించడం, ఓ ప్రజాప్రతిధికి ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని అన్నారు. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నచ్చచెప్పడంలో వివాదం సద్దు మణిగింది.




నేరడిగొండ ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## గిరిజన ఎమ్మెల్యే అని చిన్నచూపా?

- ప్రొటోకాల్ పాటించలేదని ఆందోళన
- ఆశ్రమ పాఠశాల గేటు వద్ద నిరసన
- ఎమ్మెల్యే చొరవతో శాంతించిన నాయకులు

నేరడిగొండ, డిసెంబర్ 14 : 'గిరిజన ఎమ్మెల్యే అని చిన్న చూపా? అధికార ఎమ్మెల్యే కాకపోతే ఫ్లెక్సీలో ఫొటో పెట్టరా? ఎమ్మెల్యేను అవమానిస్తారా?' అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శనివారం లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కామన్ డైట్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల గేటు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఫొటో లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే అని చూడకుండా ప్రొటోకాల్ పాటించకుండా అవమానిస్తారా? అని అధికారుల తీరుపై ఎమ్మెల్యే అనుచరులు మండిపడ్డారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకున్నది. గేట్ వద్ద నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి, మంత్రికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడికి ఇన్‌చార్జి మంత్రి సీతక్క రావాల్సి ఉండగా.. టెన్షన్ వాతావరణం నెలకున్నది. 'కలెక్టర్ రావాలి.. న్యాయం చేయాలి..' అంటూ నినాదాలు చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### గిరిజన ఎమ్మెల్యే అని చిన్నచూపా..

అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం నియోజవర్గ ప్రజలను అవమానించినట్టేనని అన్నారు. ఒక ఎమ్మెల్యేను కనీసం గేటు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఫొటో లేకపోవడంపై ఎమ్మెల్యే లేడనకున్నారా? లేక గిరిజన ఎమ్మెల్యే అని చిన్నచూపు చూస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రతి పక్షంలో ఉన్న ఎమ్మెల్యేను అవమానించడం సరికాదని, ఎమ్మెల్యేకు కాదని ఇన్‌చార్జిలకు అధికారిక కార్యక్రమాల బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. రోజు ఒక్కరిది కాదని ఏదో ఒకరోజు మాకు వస్తదని అప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికార పార్టీ నాయకులను హెచ్చరించారు. ఎమ్మెల్యే పదవికి గౌరవం ఇవ్వాలని కనీస పరిజ్ఞానం ఉండాలని, ఇలా చేసిన వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. పార్టీ నాయకులందరూ శాంతించాలని ఎమ్మెల్యే కోరడంతో వారు ఆందోళన విరమించారు. చివరకు పార్టీ నాయకులందరూ గేటు బయటే ఉండగా, ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరయ్యారు.

## పగలూ ఇగం

- బేలలో 6.2 డిగ్రీల సెల్సియస్
- రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు



*బేల మండలంలో శనివారం అత్యల్పంగా 6.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రైతులు, కూలీలు ఇతర ఉపాధుల వారు ఉదయం 10 తర్వాతనే పనులకు వెళ్తున్నారు. పగటి వేల కూడా చలిమంటలు వేసుకుని ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. తర్వాత సాయంత్రం నాలుగు గంటలకే ఇండ్లకు చేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా బేలలో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు.*

*- బేల, డిసెంబర్ 14*

ఉదయం 10 గంటలకు చలి మంట కాగుతున్న ప్రజలు



### నిర్మల్ జిల్లా గ్రూప్-2 సమాచారం..

| | | |
|---|---|---|
| దరఖాస్తుదారులు | : | 8,080 |
| కేంద్రాలు | : | 24 |
| చీఫ్ సూపరింటెండెంట్లు | : | 24 |
| పరిశీలకులు | : | 26 |
| డిపార్ట్‌మెంట్ అధికారులు | : | 26 |
| ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు | : | 86 |
| జాయింట్ రూట్ అధికారులు | : | 4 |
| లోకల్ రూట్ అధికారులు | : | 4 |
| ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు | : | 10 |
| బయోమెట్రిక్ సిబ్బంది | : | 62 |
| ఇన్విజిలేటర్లు | : | 337 |

# గ్రూప్-2కు రెడీ

- నేడు, రేపు పరీక్షలు
- నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు..
- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 14 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులతో సమీక్షలు నిర్వహించి లోటు పాట్లు లేకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచారు. నిమిషం నిబంధన ఉండడంతో గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుండగా.. ఉదయం 9.30 గంటలకే గేట్లను మూసివేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు పరీక్ష ఉండగా.. 2.30 గంటలకే గేట్లు మూసివేస్తారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు ఉండడంతో అభ్యర్థులు చేతులకు గోరింటాకు, మెహంది వంటివి పెట్టుకోవడం వల్ల బయోమెట్రిక్‌లో వేలి ముద్రలు సరిగ్గా వచ్చే అవకాశం ఉండదు. అందుకోసం పెట్టుకోవద్దు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, క్యాలిక్యూలేటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. హాల్‌టికెట్‌పై ఫొటో అతికించుకోవాలి. ఏదైనా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు(ఓటర్, ఆధార్, పాన్, ఎంప్లాయి ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్)తో కేంద్రాలకు చేరుకోవాలి. కాగా.. కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా 163 సెక్షన్‌ను విధిస్తున్నామని, అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.

## ప్రతిష్ట బందోబస్తు : ఎస్పీ గౌష్ ఆలం

పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉన్నం

ఎదులాపురం, డిసెంబర్ 14 : గ్రూప్-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 29 సెంటర్లలో 10,428 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పరీక్ష సజావుగా జరిగేందుకు పోలీస్ శాఖ తరపున పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దున ప్రజలు ఎవరు గూమికూడి ఉండకూడదన్నారు. అత్యవసర సమయంలోనైనా అభ్యర్థులు డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగం సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు.

# లోక్ అదాలత్ సక్సెస్

- ఈ ఏడాది చివరి లోక్ అదాలత్ ఇదే..
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్

ఎదులాపురం, డిసెంబర్ 14 : మనసున్న న్యాయవాదులు చాలా మంది ఉన్నారని, అలాగే అందరికీ సహకరించే కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఉన్నారని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు అన్నారు. ఈ ఏడాది చివరి జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం డీఎల్ఎస్ఏ కార్యాలయ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. తెలిసోతెలియకో తప్పులు చేసి కేసుల్లో ఇరుక్కుని కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరుగుతున్నారన్నారు. దీని కారణంగా కోర్టుల్లో కేసుల సంఖ్య పెరిగిపోతున్నదన్నారు. వీటిని తగ్గించేందుకే డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, హుస్సేన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య, పీపీలు రమణారెడ్డి, సంజయ్‌కుమార్ వైరాగ్రె, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, ఏఎస్పీ బి.సురేందర్‌రావ్, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, హసిబుల్ల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

### భారీ స్పందన : ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్‌లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన వచ్చిందని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. పరిష్కరించిన కేసుల వివరాలను వెల్లడించారు. జిల్లాలోని పరిష్కరించవలసిన కేసులు 1,732 ఉండగా.. ఇందులో 334 పరిష్కరించగా, 25 ఈ పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1373 ఉండగా వాటికి రూ.13.73 లక్షల ఫైన్ విధించినట్లు తెలిపారు. ఎఫ్ఐఆర్ కేసులలో ఈ పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎక్సైజ్ కేసులు, నేర నిరూపణ ఉన్న నిందితులు స్వయంగా న్యాయ స్థానాలకు హాజరై తప్పులను ఒప్పుకోవడంతో కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా పోలీసు వ్యవస్థతో వివిధ సమావేశాలు ఏర్పాటు చేస్తూ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన డీసీఆర్‌బీడీఎస్పీ సురేందర్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీఎల్ జీవన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబిల్లా, సిబ్బంది హకీం, వెంకటమ్మ, సుభాష్ యాదవ్, శేఖర్, వెంకటేశ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### సద్వినియోగం చేసుకోవాలి..

నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 14 : కక్షిదారులు రాజీ కుదుర్చుకేందుకు వీలున్న పలు కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. రాజీకి కుదుర్చోవలసిన 1630 కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 2, క్రిమినల్ 1565, ప్రీ లిటిగేషన్ 63 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్న న్యాయమూర్తి



స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకుంటున్న న్యాయమూర్తి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 14 : ఒకరు అనారోగ్యంతో నడవలేని స్థితిలో కోర్టుకు హాజరు కాగా.. న్యాయమూర్తి బయటకొచ్చి అతని వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సారంగాపూర్ కు చెందిన నర్సింగ్‌రావు 2021 సంవత్సరంలో నారాయణ రిటైర్డ్ తహసీల్దార్ పైన వివిధ కారణాలతో సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. వీరిద్దరూ ఇష్టపూర్వకంగా కేసు రాజీ చేసుకోవాలనే ఉద్దేశంతో శనివారం లోక్ అదాలత్‌కు హాజరయ్యారు. నారాయణ అనారోగ్యంతో పూర్తిగా నడవలేని స్థితిలో కారులోనే ఉండగా అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి భవిష్య తాను కూర్చున్న స్థలం నుంచి బయటకొచ్చి వారి వద్దకే వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని రాజీ కుదిర్చారు.